

మధురానగర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు నోట్‌బుక్స్ అందిస్తున్న నాయకులు

ప్రజలు సుఖశాంతులతో జీవించాలి

● న్యూ ఇయర్ వేడుకల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 1 : గతేడాది చేదు జ్ఞాపకాలను మరచిపోయి, కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు. మండలంలోని మధురానగర్‌లో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు నోట్ బుక్స్ అందించి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రణవ్

మంత్రులను కలిసిన వొడితల ప్రణవ్

హుజూరాబాద్‌టౌన్, జనవరి 1: రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జన్మదిన వేడుకల్లో శ్రీనివాస్‌రావుతో కేకు కోయిస్తున్న వినోద్‌కుమార్

వృద్ధులకు అన్నదానం.. పండ్ల పంపిణీ

తిమ్మాపూర్, జనవరి 1: మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు జన్మదినం సందర్భంగా శ్రీనన్న యువసేన ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో అన్నదానంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. అలాగే మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కార్యాలయంలో శ్రీనివాస్‌రావుతో కేకు కట్ చేయించి వేడుకలు జరిపారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన న్యూ ఇయర్ వేడుకలు

- కేక్‌లు కట్ చేసి సంబురాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ప్రజాప్రతినిధులు, నేతలకు శుభాకాంక్షల వెల్లువ

కార్పొరేషన్/కమాన్‌చౌరస్తా/తెలంగాణచౌక్/ హుజూరాబాద్ టౌన్/ జమ్మికుంట/ మానకొండూర్ రూరల్/ చొప్పదండి(రామడుగు)/ గన్నేరువరం/ తిమ్మాపూర్/ వీణవంక/శంకరపట్నం, జనవరి 1: జిల్లా వ్యాప్తంగా సోమవారం నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రజలు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. నూతన సంవత్సరంలో గతేడాడి చేదు అనుభవాలు తొలిగి సుఖ సంతోషాలు కలుగాలని తమ ఇష్ట దైవాలను ప్రార్థించుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు, యువతులు రంగవల్లులు వేశారు. విద్యాసంస్థ ల్లో విద్యార్థులు ఆడి పాడారు. సాన్వి డిఫెన్స్ అకాడమీ, పారమిత విద్యాసంస్థల్లో న్యూ ఇయర్ వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం సాయంత్రం సమయంలో డీర్‌పార్క్, ఉజ్వల పార్క్, మానేరు డ్యాం, తీగలవంతెన వద్ద జనం సందడి కనిపించింది. ప్రజాప్రతినిధులు, నేతలకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మేయర్ సునీల్ రావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమారీలు ప్రత్యేక క్యాలెండర్ అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని సీఎస్ఐ

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

వీర్ల వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకుడు

వెస్లీ కెథడ్రిల్ చర్చిలో బిషప్ డాక్టర్ కె రూబెన్మార్క్ ప్రత్యేక సందేశమిచ్చి ప్రార్థనలు చేయించారు. క్వాయర్స్ బృందం గీతాలు అలరించాయి. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడగోండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, నాయకులు మెండి చంద్రశేఖర్, బాలయ్య, మహేశ్ పాల్గొన్నారు. ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో ఈడీ వినోద్‌కుమార్ కేక్ కట్ చేసి, అధికారులు, సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, డీఏలు మల్లయ్య, మల్లేశం, స్టేషన్ మేనేజర్ అంజయ్య ఉన్నారు. హుజూరాబాద్‌లో ఆదివారం అర్ధరాత్రి అంబేద్కర్ చౌరస్తాలో టౌన్ సీఐ బొల్లం రమేశ్ కేక్ కట్ చేశారు. పట్టణంలో సోమవారం పలు చోట్ల జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్‌చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. హుజూరాబాద్ మండలం రంగాపూర్ కల్వరి టెంపుల్ చర్చిలో ఫాదర్ నెల్సన్-సుదిన దంపతులు కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచారు. జమ్మికుంట వాకర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు కేక్ కట్ చేశారు. మానకొండూర్ మండలం గంగిపల్లిలో కరీంనగర్ కార్పొరేటర్ వాల రమణారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావును మండలంలోని పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, యూత్ మండలాధ్యక్షుడు ఆరపెల్లి ప్రశాంత్, నాయకులు తదితరులున్నారు. వీణవంక మండలంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మేయర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మేయర్, కార్పొరేటర్లు

హుజూరాబాద్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కలెక్టర్‌కు నోట్‌బుక్కులు అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

ప్రజాసంక్షేమంపై ప్రతిన బూనుదాం

● ఏడాది పాటు ఆచరిద్దాం ● కలెక్టర్ పమేలా సత్పతి పిలుపు

కలెక్టరేట్/విద్యానగర్, జనవరి 1: 'ప్రజా సంక్షేమమే పరమావధిగా భావిస్తూ, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేందుకు కొత్త ఏడాదిలో ప్రతిన బూనుదాం.. ఏడాది పాటు ఆచరిద్దాం' అంటూ కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పిలుపునిచ్చారు. 2024 ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు నోటు పుస్తకాలు, పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. 'కార్యాలయాలు, ఇళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం. విద్యుత్‌ను ఆదా చేద్దాం. ఆహారాన్ని వృథా కాకుండా చూడాలి. కరీంనగర్‌ను శుభ్రమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, జిల్లా ప్రజలు సహకరించాలి' అని కోరారు. అనంతరం కొత్త ఏడాది సందర్భంగా అన్ని శాఖల అధికారులు కేకులు, పూల బొకేలు కాకుండా చదువుకునే పిల్లల కోసం పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడులు, వసతి గృహాల్లోని పిల్లల కోసం దుప్పట్లు తెచ్చి కలెక్టర్‌కు అందజేశారు. వీటిని పంపిణీ చేసేందుకు ఉద్యోగులతో కమిటీ ఏర్పాటు చేసి పాఠశాలల పిల్లలకు అందజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, డీఆర్డీవో శ్రీలత, ఆబ్కారీ జిల్లా శాఖాధికారి శ్రీనివాసరావు, ఎల్‌డీఎం ఆంజనేయులు, సీపీవో కొమురయ్య, డీఏవో శ్రీధర్, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీడబ్ల్యూవో ఎం.సరస్వతి, డీవైఎస్‌వో రాజవీరు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీపీఆర్వో కలీమ్, డీఈ కొండయ్య, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతిని జిల్లా మహిళాధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ లలితాదేవి, ప్రభుత్వ జిల్లా దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ జ్యోతి, అదనపు ఆర్ఎంవో డాక్టర్ నవీన, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఐవో సాజీదా, డీఆర్డీఏ పీడీ శ్రీలత ఉన్నారు.

జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా గీకురు రవీందర్

గీకురు రవీందర్

చిగురుమామిడి, జనవరి 1: కరీంనగర్ జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా చిగురుమామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్‌ను డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ నియమించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రవీందర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

పలువురు పోలీసు అధికారులకు సేవా పథకాలు

రాంనగర్ జనవరి 1: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖ, అనుబంధ శాఖల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పలు సేవా పతకాలను ప్రకటించింది.

మహోన్నత సేవాపతకం

కరీంనగర్ పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో పనిచేస్తున్న ఎస్ఐ ఎండీ అహ్మద్ కు రాష్ట్ర పోలీసు మహోన్నత సేవా పతకం వచ్చింది.

ఉత్తమ సేవ పతకం

కరీంనగర్ మహిళా ఠాణాలో పనిచేస్తున్న ఏఎస్ఐ కాశెట్టి కిషన్, ఎస్సీ హెడ్ కానిస్టేబుల్ నాగులపల్లి నర్సింహా, రామడుగు ఠాణా హెడ్ కానిస్టేబుల్ ననుమాల భూమయ్య, ఏఆర్ఎస్ఐజీ రాజిరెడ్డి(పీటీసీ), మాడపు శ్రీనివాస్(ఇంటలిజెన్స్, హెడ్కానిస్టేబుల్) ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

సేవాపతకాలు

పంచగ్నుల వెంకటరమణమూర్తి-హెచ్‌సీ(చిగురుమామిడి), చింతపల్లి యుగేందర్-హెచ్‌సీ(గన్నేరువరం), చాట్ల సుధాకర్-హెచ్‌సీ(కరీంనగర్), ఈగ మల్లేశం-హెచ్‌సీ(కరీంనగర్), జండలపల్లి ఓదయ్య-పీసీ(కరీంనగర్), ఏఎస్ఐ ఎండీ చాంద్ పాషా(కరీంనగర్-1 టౌన్), శనిగరం జాన్-హెచ్‌సీ(కొత్తపల్లి), కంసాని వేణు-హెచ్‌సీ(చొప్పదండి), సిరిసిల్ల శంకరయ్య-హెచ్‌సీ(మానకొండూర్), కాదర్ల మురళీధర్-పీసీ(చిగురుమామిడి), నీలం రాంమోహన్- (సీపీవో) హెచ్‌సీ(చిగురుమామిడి), మొలగూరి గణపతి-ఏఆర్‌హెచ్‌సీ(కరీంనగర్), పీటీసీ ఎస్సీ ఎస్ శ్రీనివాస్, డీఎస్సీ జీ విజయపాల్ రెడ్డి, ఏఎస్ఐ ఎం శ్రీనివాస్, ఎండీ ఇంతియాజ్ అలీ(ఇంటలిజెన్స్ -కరీంనగర్)లకు సేవా పతకాలు లభించాయి. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో హెచ్‌సీ కర్ణాల శ్రీ నివాస్, ఎస్ఐ కాంపల్లి నారాయణబాబులు ఉత్తమ సేవా పతకాలకు ఎంపిక కాగా, సీఐ బండ ప్రశాంత్‌రావు సేవా పతకానికి ఎంపికయ్యారు. అగ్నిమాపకశాఖలో డి. ప్రభాకర్-ఏడీఎఫ్ఏకు ఉత్తమ సేవా పతకం, రాంచందర్(డ్రైవర్)కరీంనగర్‌కు సేవా పతకాలకు ఎంపికయ్యారు.

నూతన సంవత్సర వేడుకల్లో కేక్ తినిపిస్తున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

కేడీసీసీబీ సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందిస్తాం

● చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

విద్యానగర్, జనవరి 1: కరీంనగర్ జిల్లా సహకార సెంట్రల్ బ్యాంక్‌లోని అన్ని స్థాయిల ఉద్యోగులకు భవిష్యత్ అవసరాల కోసం సన్నద్ధం కావడానికి నిరంతర అభ్యాసం, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను రూపొందిస్తామని నాస్కాబ్, టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేసి ఉద్యోగులకు పంచిపెట్టారు. రవీందర్‌రావు మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంతో పాటు ప్రతి చోటా పోటీ పెరిగిందని, ఇతర బ్యాంకులతో పోటీ పడుతున్నామన్నారు. కేడీసీసీబీ సీఈవో ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రముఖ జాతీ య బ్యాంకులైన ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత కరీంనగర్ డీసీసీబీ వ్యాపారం చేయడంలో మూడో స్థానంలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీబీ వైస్ చైర్మన్ పి రమేశ్, జనరల్ మేనేజర్లు ప్రభాకర్ రెడ్డి, ఉషశ్రీ, యూనియన్ నాయకుడు హనుమంతరావు, ప్రధాన బ్రాంచ్ మేనేజర్ కే సునీల్, సేల్స్ అధికారి వంశీ, డీజీఎంలు, ఏజీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పూజలు

కమాన్‌చౌరస్తా, జనవరి 1: జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పాత బజార్ శివాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఇక్కడ మేయర్ సునీల్ రావు, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ చౌక్, జనవరి 1: నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మాజీ ఎంపీ వినోద్‌కుమార్ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడారు. వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలను అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు, నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహరావు, ఉపాధ్యక్షుడు గండ్ర సంపత్‌రావు, జాయింట్ సెక్రటరీ భూపతిరావు, కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్‌రావు, మాధవరావు పాల్గొన్నారు.

పద్మనాయక కళ్యాణ మండపంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాయకులు

గవర్నర్‌ను కలిసిన కరీంనగర్ ఇండియన్ రెడ్ క్రాస్ సెక్రటరీ

విద్యానగర్, జనవరి 1: కరీంనగర్ ఇండియన్ రెడ్ క్రాస్ సెక్రటరీ వుట్కూరి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపడంతో పాటు చేతితో తయారుచేసిన గవర్నర్ ఫొటో జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఫార్చ్యూన్ మెడికేర్ హాస్పిటల్ చైర్మన్ ముప్పిడి రాజశేఖర్ రెడ్డి, యూత్ కో ఆర్డినేటర్ యశ్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివాస్

తెలంగాణచౌక్, జనవరి 1: ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ విజయ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. సోమవారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని మహార్ వీరుల విజయాలను వివరించారు. ప్రతి సంవత్సరం జనవరి 1న దేశ వ్యాప్తంగా భీమ కోరేగాం విజయోత్సవాలను జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మొగురం రమేశ్, సిగిరి శ్రీధర్, దొంత కనకయ్య, బోయినపల్లి చంద్రయ్య పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి, జనవరి 1: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి జూలపల్లి మండలానికి చెందిన నోముల కళావతి-గోపాల్ రెడ్డి దంపతులు సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.60,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్ మాట్లాడుతూ, దాతల నుంచి వచ్చే విరాళాలతో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా జరిపేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మునిగాల సుధాకర్, కార్యదర్శి ఉసికె రాజశేఖర్ రెడ్డి, పిల్లి సాయి చందు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 1: కొత్త డీటీఆర్ పనులు చేపడుతున్నందున 11కేవీ రాంచంద్రాపూర్ కాలనీ ఫీడర్‌కు మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాంచంద్రాపూర్ కాలనీ, ఏవో స్ కాలనీ, లేక్ పోలీస్ స్టేషన్, బైపాస్ రోడ్డు, పెద్దమ్మ గుడి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైభవంగా రాముడి అక్షింతల శోభాయాత్ర

మానకొండూర్ రూరల్/ శంకరపట్నం/కరీంనగర్ రూరల్/హుజూరాబాద్‌టౌన్, జనవరి 1: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అయోధ్య రాముడి పూజిత అక్షింతలను గ్రామాలకు చేరవేయగా, భక్తులు మేళతాళాల మధ్య వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. సోమవారం మానకొండూర్ మండలం ముంజంపల్లిలో శోభాయాత్ర అనంతరం విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి దేవసాని సంపత్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శోభాయాత్రకు దారి పొడవునా భక్తులు, మహిళలు మంగళహారతులతో ఎదురేగి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ మొకిరాల కిషన్‌రావు, మాజీ సర్పంచ్ సర్వ తిరుపతి పాల్గొన్నారు. కరీంనగర్ మండలంలోని ఫకీర్ పేట, దుర్శేడ్ గ్రామాల్లో సర్పంచులు కటకం నందయ్య, గాజులు వెంకటమ్మ ఆధ్వర్యంలో అయోధ్య సీతారాముల అక్షింతలను ఊరేగించారు. అనంతరం హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలోని ఇంటింటికీ సీతారాముల అక్షింతలు పంపిణీ చేశారు. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి స్పర్శ అక్షింతల వితరణ కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ నిరంజనాచారి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ నిర్మల, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సంయోజక్‌లు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్: ముంజంపల్లిలో అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా మహాలింగార్చన

కమాన్‌చౌరస్తా, జనవరి 1 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో ధనుర్మాసాన్ని సోమవారం పురస్కరించుకుని 'పార్థివ మహాలింగార్చన' అఖండ భజన సంకీర్తనలు అట్టహాసంగా నిర్వహించారు. ప్రదోష కాలంలో లోక కల్యాణం కోసం నగర పురోహితులు మంగళంపల్లి శ్రీనివాసశర్మ, ఆలయ ప్రధానార్చకులు మంగళంపల్లి రాజేశ్వరశర్మ, డింగరి చాణక్య ఆధ్వర్యంలో వేములవాడ ఆలయ అర్చకులు, ఆలయ ఈవో కాంతా రెడ్డి ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు.

శంకరపట్నం, జనవరి 1: మండల కేంద్రంలోని సాయి కృష్ణ ఇండస్ట్రీస్‌లో హనుమాన్ ఆలయ చైర్మన్ తనుకు ప్రభాకర్ దంపతులు సోమవారం అయ్యప్ప పడి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి శరణు ఘోషతో పరిసరాలు మార్మోగాయి. పడి పూజలో తనుకు సోదరులు తిరుపతయ్య, ఓంకారం, సత్యనారాయణ, కుమారస్వామి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాపారులు, గురుస్వాములు, కన్నె స్వాములు పాల్గొన్నారు.

భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వాములు

నేషనల్ హాకీ టోర్నీ క్రీడాకారులు నేడు రిపోర్టు చేయాలి

హుజూరాబాద్‌టౌన్, జనవరి 1: ఈ నెల 4 నుంచి కర్ణాటకలో జరుగనున్న అండర్-17 నేషనల్ హాకీ బాలికల టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారులు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా మహబూబ్‌నగర్ పట్టణంలో రిపోర్ట్ చేయాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరీంనగర్ సెక్రటరీ సొల్లు సారయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు పీఈటీలు రామచంద్రమ్మ (7794927619), రాధిక (9381191011)ను సంప్రదించాలని సూచించారు.

ముకాస నూతన కార్యవర్గం ఎన్నిక

గంగాధర, జనవరి 1: మండలంలోని మల్లాపూర్ గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోల ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా కోల మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా మడిదపెల్లి మల్లేశం, కార్యదర్శిగా హరీశ్, కోశాధికారిగా అజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, నూతన కార్యవర్గానికి గ్రామ మున్నూరుకాపు సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థి ఎంపిక

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 1: ఢిల్లీలో ఈనెల 26న నిర్వహించనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లా కేంద్రంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్(సీబీఎస్ఈ) పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి జే శ్రీచరణ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా చరణ్‌ను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఫాతీమారెడ్డి, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

'జన సంపర్క్ అభియాన్'ను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 1: సమాజంలోని దళితులను ఐక్యం చేసి వారిని చైతన్యపరచడం కోసం మంగళవారం (నేటి) నుంచి చేపడుతున్న జన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరి రక్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి లక్ష్మణ్ కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో సోమవారం కార్యవర్గ సభ్యుల సమావేశంలో అయన మాట్లాడారు. శ్రీరాముడి భవ్యమైన ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా దళితుల ఆరాధ్యుడు జాంబవంతుడి సేవలను దళిత సమాజానికి వివరించి హిందూ దళితుల ఐక్యత కోసం జన సంపర్క్ అభియాన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృష